క్లుప్తంగా

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



మాగనూర్: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో మండల కేంద్రం సమీపంలోని పెద్దవాగు వంతెన వద్ద ఎస్ఎస్‌టీ టీం–1 సభ్యులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ముఖ్యంగా రాయచూర్, హైదరాబాద్, యాదగిరి వైపు నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌టీ టీం–1 అధికారి ఆనంద్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ సడలించే వరకు ఈ వాహనాల తనిఖీలు కొనసాగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తనిఖీలకు సహకరించాలని కోరారు. అనుమతికి మించి డబ్బులు తరలించొద్దని ఒకవేళ తరలిస్తే అట్టి డబ్బును సీజ్ చేయడం జరుగుతుందన్నారు. వాహనాల తనిఖీ మొత్తం విడియో కవరేజ్ మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ టీం–1 సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్యపరీక్షలు



ఊట్కూరు: కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గ్రామపంచాయతీ వద్ద వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు వంద మంది కార్మికులకు రక్త నమూన పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ మహమ్మద్ ఆదీప్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న గుర్తింపు కార్డు కలిగి ఉన్న కార్మికులకు రక్తపరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. 15రోజులలో రక్త పరీక్షకు సంబంధించిన రిపోర్టులను కార్మికులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అబ్దుల్ నహీం, రేష్మాబేగం, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు



మరికల్: మండలంలోని పల్లెగడ్డ, మరికల్, ఎలిగండ్ల, పెద్దచింతకుంట తదితర గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రభావంతో బిల్లులు నిలిచిపోవడంతో కొన్నిగ్రామాల్లో భవన నిర్మాణపనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో సర్పంచ్‌లకు బిల్లుల రాకపోవడంతో అప్పులుచేసి పంచాయతీ భవనాల నిర్మాణాలను చేపడుతున్నారు.

జోరుగా వరికోతలు



మరికల్: మండల వ్యాప్తంగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోయిల్‌సాగర్ ఆయకట్టు కిందసాగు చేసిన వరిపంటలను రైతులు కోతలు వేస్తున్నారు. కేపీసీ ఆయకట్టు కింద దాదాపు 9వేలకు పైగా వరిసాగు చేశారు. కోతమిషన్ల ధరలు భారీగా పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అకాల వర్షాల భయం పట్టుకోవడంతో రైతుల ఆందోళనను గమనించిన కోతమిషన్ల యాజమానులు గంటకు రూ. 2500 నుంచి 3వేల వరకు వసూలు చేస్తున్నారు.

మహాసభకు తరలిన విశ్వకర్మలు

మరికల్: తమ సమస్యల సాధనకోసం ఆదివారం హైదరాబాద్‌లో జరిగే విశ్వకర్మల మహాసభకు తరలివెళ్లారు. గతకొన్నేళ్ల నుంచి విశ్వకర్మల సమస్యలను ఏ రాజకీయ పార్టీల నాయకులు పట్టించుకోవడం లేదని ఆ సంఘం నాయకులు భాస్కర్, హరిష్, సూర్యప్రకాష్ అన్నారు. ఎన్నికలు రాగానే రాజకీయ పార్టీల నాయకులకు కులసంఘాలు గుర్తుకు వస్తాయన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.



కోతుల తిప్ప.. వేగేదెట్టా!

- ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్న కోతులు
- అడ్డుకుంటే దాడిచేసి గాయపరుస్తున్న వైనం



మాగనూర్‌లో ఇళ్లపైకి చేరుతున్న కోతులు

మాగనూర్: మండల కేంద్రంలో కోతుల బెడద అధికమైంది. పంట చేలను నాశనం చేస్తున్నాయి. మరో వైపు గ్రామంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలలో చొరబడి అగమాగం చేస్తున్నాయి. కొన్ని సందర్భాలలో మహిళలు, చిన్న పిల్లలపైనా దాడులకు పాల్పడి గాయపరుస్తున్నాయి. ఈ కోతల బెడదతో గ్రామంలో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ముఖ్యంగా ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇంటి పైకప్పు, చెట్లు, ప్రహరీలపై రాత్రి, పగలు తేడా లేకుండా కోతులు సంచరిస్తున్నాయి.

పంట చేలు నాశనం..

గ్రామ సమీపంలో పత్తి, వేరుశనగ కాయలను పూర్తిగా తినేస్తున్నాయి. చేలను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల బాధ తాళలేక కొందరు రైతు కూరగాయల సాగు చేయలేకపోయారు. గతంలో రైతులు ఇతర జంతువుల కోసం కాపాల ఉండేవారు. ఇప్పుడు కోతుల బేడద అధికమవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు, దుకాణాల్లో..

కోతులు ఇళ్లపైకి ఎక్కి నానాతంటలు చేస్తున్నాయి. ఇంటి వద్ద ఖాళీ స్థలంలో ఏదైన కూరగాలను, పండ్లను పెంచుకుంటే అవి కోతుల పాలే అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల్లో అయితే ఏ వస్తువును వదలడం లేదు.

దాడులు చేస్తున్నాయి..



కోతులు నిత్యం ఇంటి చూట్టూ తిరుగుతూ ఆహారం కోసం ఇంటి లోపలకి వచ్చి తినే వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుకుంటే వెంటబడి మరీ గాయపరుస్తున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– సుమన్, గ్రామస్తుడు, మాగనూర్

సమస్య పరిష్కరిస్తాం..



మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉన్న మాట వాస్తవమే. ప్రజల ఫిర్యాదుమేరకు గతంలోనే ఎంపీడీఓకు లిఖిత పూర్వకంగా తెలియజేశాం. సంబంధిత అధికారులతో మాట్లాడి కోతులను అడవులకు తరలిస్తాం.

– రాజు, సర్పంచ్, మాగనూర్

సీఎం సభకు తరలిరావాలి



మక్తల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



నర్వలో మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్

నారాయణపేట రూరల్/మక్తల్/మాగనూర్/దామరగిద్ద/ నర్వ: జిల్లా కేంద్రంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు విచ్చేస్తున్న సీఎం సభకు నియోజకవర్గ ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు వేపూరిరాములు, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నియోజకవర్గ అభివృద్ధికి తనవంత కృషిచేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పట్టణంలో సోమవారం ఉదయం 11గంటలకు జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిట్టెం పిలుపునిచ్చారు. అలాగే కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ పిలుపు నిచ్చారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో యువతతో సమావేశం నిర్వహించి మా ట్లాడారు.. దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా లేని 450కి పైగా సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సకల జనులకు అందించారన్నారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడల చైర్మన్ ఆంజనేయులుగౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ, రాజేష్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, అమరేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజుల ఆశిరెడ్డి, చిన్నహన్మంతు, ఆనంద్‌శేఖర్, కృష్ణ, మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీనివాసులు, రాజు, నర్సింహులు, నర్సింహారెడ్డి, పల్లెమారెప్ప, వెంకటయ్య, మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జయరాములుశెట్టి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వీణావతి శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికే పట్టం కట్టండి



నారాయణపేటలో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి

నారాయణపేట: నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం పట్టణంలోని 23వ వార్డులో ఇంటింటా ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి స్వాతి రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఎస్ఆర్‌రెడ్డిని అసెంబ్లీకి పంపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గందె అనసూయ, ఎంఐఎం కౌన్సిలర్ తఖిచాంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దామరగిద్ద: ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని మండల అధ్యక్షుడు ఆశన్న ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో తిప్పన్న, రాములు, బసంత్‌రెడ్డి, రాచప్ప, భీంరెడ్డి, వెంకట్‌రెడ్డి, భీంరెడ్డి, బస్వరాజ్, అంజి పాల్గొన్నారు.

గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి ప్రచారంలో మాట్లాడుతున్న పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ గెలుపుతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యపడుతుందని నాయకులు అన్నారు. ఆదివారం చిన్నజట్రంలో జెండాలతో ర్యాలీ నిర్వహించగా బైరంకొండలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని గెలిపించాలని కోరారు. తిమ్మయ్య నరేందర్, గంగప్ప, ఉసేనప్ప, శ్రీనివాస్, నారాయణ, బాలప్ప, కతలప్ప, రామకృష్ణ, నవీన్, కిట్టు, ఉదయ్, అశోక్ పాల్గొన్నారు.

మక్తల్: కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి వాకిటిలలిత ఓటర్లను కోరారు. ఆదివారం పట్టణంలోని ఇంటింటి నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాధిక, రాములమ్మ పాల్గొన్నారు.

దామరగిద్ద: హస్తం గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని కంసాన్‌పల్లి, వత్తుగుండ్ల, వత్తుగుండ్ల తాండా, క్యాతన్‌పల్లి, ముస్తాపేట్, దేశాయ్‌పల్లి, అయ్యావారిపల్లి, బాపన్‌పల్లి, మద్దెల్‌బీడ్ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతో ప్రజాసంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బాల్‌రెడ్డి, శరణ్యానాయక్, హన్మంతు, శ్రీనివాస్, లక్ష్మణ్, ఆనంద్‌కుమార్ లక్ష్మణ్, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులు

కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని భక్తిమళ్ల గ్రామానికి చెందిన యువకులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కాపలా ఉంటామని రాష్ట్రాన్ని దోచుకున్నారు'

అమరచింత: కొట్లాడి సాధించుకున్న రాష్ట్రానికి కాపాల ఉంటూ ప్రజల అభ్యున్నతికి పాల్పడుతానని ప్రగల్భాలు పలికిన సీఎం కేసీఆర్ కేవలం రాష్ట్రంలోని సంపదను దోచుకోంటున్నారని టీపీసీసీ కల్లుగీత కార్మిక రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మక్తల్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న వాకిటి శ్రీహరిని గెలిపించమంటూ ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 3, 4వ వార్డులలో ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేస్తూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు..



రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మద్దూరు నాయకులు

మద్దూరు: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినా వారిలో పల్లెగడ్డ వెంకటయ్య, కుదుగుంట నర్సింహులుగౌడ్, నిడ్జింత చందు, ప్రకాష్, మహిపాల్, రవిగౌడ్, మనోహర్, ప్రకాష్ ఉన్నారు. రవికుమార్, విజయ్, రఘు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని భూత్పుర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు దాదాపు 150మంది కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రఘుపతిరెడ్డి, జనార్దన్‌గౌడ్, బత్తలయ్య , తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఆదివారం చేరిన నాయకులు, కార్యకర్తలకు కుంభం శివకుమార్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. వార్డు సభ్యులు రామకృష్ణరెడ్డి, ఆంజనేయులుతోపాటు ఇతర ముఖ్య నేతలతో 250మంది కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ధన్వాడ మండలం కొండ్రోన్‌పల్లిలో దాదాపు 300 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో వీరన్న, సూర్యమోహన్, కృష్ణయ్య, హరిష్, రామకృష్ణ, రఘు, మొగులప్ప, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి

మల్దకల్: చదువుకోవాలని తండ్రి మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ విద్యార్థి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఏఎస్ఐ ఈశ్వరయ్య కథనం ప్రకారం.. మండలంలోని మద్దెలబండకు చెందిన తిరుమలయ్య, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు సురేష్(20) గద్వాలలో డిగ్రీ చదువుకుంటున్నాడు. గత నెలలో సురేష్ ఇంటికి రావడంతో తండ్రి చదువుకోవాలని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ గత నెల 27న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని, ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

సబ్‌కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: నిర్మించిన పలు రకాల భవ నాలకు సంబంధించిన బిల్లులు మంజూరు కావడం లేదని మనస్తాపంతో సబ్ కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ సమీపంలో నిర్మిస్తున్న జర్నలిస్టుల డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు మరికొన్ని కాంట్రాక్ట్ పనులు చేయిస్తున్న జైకుమార్ శనివారం రాత్రి పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. నిర్మించిన భవనాలకు సంబంధించి బిల్లులు ఇవ్వకుండా కాంట్రాక్టర్ పెండింగ్‌లో పెట్టడంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. చికిత్స నిమిత్తం మొదట ఎస్‌వీఎస్‌కు తరలించినా.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

గెలుపే లక్ష్యంగా సాగాలి

అమరచింత: మక్తల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్ రెడ్డి గెలుపు కోసం బూత్ స్థాయి కార్యకర్తలు విస్తృతంగా కృషి చేయాలని వెంకటేశ్వర్ అన్నారు. పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పట్టణంలోని బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు.

బీజేపీలో చేరిక..



పేటలో బీజేపీ కండువా కప్పుతున్న రతంగపాండురెడ్డి

నారాయణపేట రూరల్: నారాయణపేట మండలంలోని బైరంకొండలో కొందరు బీజేపీ కార్యకర్తలు ఆదివారం ఉదయం కాంగ్రెస్ కార్యాలయంలో కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. అది తెలిసిన వెంటనే కమలం నాయకులు వారిని బుజ్జగించి పార్టీ అభ్యర్థి రతంగపాండురెడ్డి సమక్షంలో తిరిగి బీజేపీలో చేర్పించుకున్నారు.

ఇంటింటి ప్రచారం..

ఊట్కూరు: మండలంలోని బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డిని గెలిపించాలని నాయకులు ఇంటింటి చేశారు. ఆదివారం స్థానిక గోశాల హనుమాన్ మందిర్‌లో పూజలు చేసి, మోట్కార్ వీధి, మేన్‌బజార్, అయోధ్యనగర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే జలంధర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ఎంపీటీసీ హన్మంతు, నాయకులు కొండన్‌గోపాల్, వెంకట్‌రాములు, కృష్ణయ్యగౌడ్, రమేష్, రాజు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట మురుగు



ఉర్దూపాఠశాల ముందు నిలిచిన మురుగు

ఆత్మకూర్: పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల ఎదుట మురుగు నిలవడంతో విద్యార్థులు దుర్వాసన భరించలేకపోతున్నారు. పాఠశాల పరిసరాల్లో డ్రైయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో నివాసాల నుంచి వస్తున్న మురుగు పాఠశాల, రోడ్డుపై చేరుతుంది. ఈ విషయమై కాలనీవాసులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను మున్సిపల్ పాలకమండలి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, కొన్ని నెలలుగా సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

బస్టాండ్‌లో లైట్ల ఏర్పాటు



విద్యుత్ వెలుగులో అమరచింత బస్టాండ్

అమరచింత: మున్సిపల్ కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ కొన్ని నెలలుగా అంధాకారంలో మగ్గుతుండేది. విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని ఎన్నో సందర్భాలలో ఆర్టీసీ డిపో మేనేజర్‌కు విన్నవించారు. ఎవరూ స్పందించలేదు. అంధాకారంలో ఉన్న బస్టాండ్‌లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, వీటిని అరికట్టడమే కాకుండా ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బల్బులను ఏర్పాటు చేయడంతో రాత్రి వేళ వెలుగు సంతరించుకుంది.

వాకిటి శ్రీహరికి బీఫాం



మక్తల్: నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరికి ఆదివారం హైదరాబాద్‌లో గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దిపాదాస్ మున్సీ, రోహిత్ చౌద్రి, మహేష్‌గౌడ్, రోహిత్‌చౌద్రి, శివసేనరెడ్డిహర్షవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా బీఫాం అందజేశారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, టీపీసీసీ గీత తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షకుర్ తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా.. గద్వాల పట్టణంలోని షేరిల్లీవీధికి చెందిన ఖమ్రాబేగం(33)కు అయిజకు చెందిన అబిద్ హుసెన్‌తో 10 సంవత్సరాల కిందట వివాహమైంది. నాలుగు నెలల నుంచి భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో భర్త తన ఇద్దరు పిల్లలను తీసుకుని అయిజకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటూ కలతచెంది శనివారం రాత్రి పిజేపి కుడి కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రిగాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మహిళ ఆచూకి లభించ లేదు. ఆదివారం ఉదయం జములమ్మ రిజర్వాయర్‌లో గల్లంతైన మహిళ మృతదేహం తేలడంతో జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. తమ్ముడు జావెద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇథనాల్ కంపెనీ నుంచి కాపాడాలని ఆత్మహత్యాయత్నం

మరికల్: ఇథనాల్ కంపెనీ నుంచి చిత్తనూర్ గ్రామంతో పాటు ఇతర గ్రామాలను కాపాడాలని ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చిత్తనూర్‌కి చెందిన భాస్కర్ గాంధీభవన్ వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా.. కంపెనీ నుంచి తమ గ్రామం వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, నా చావుతోనైన కంపెనీ రద్దు చేయాలని కోరారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే తేరుకుని ఆత్మహత్యాయత్నం చేసుకోకుండా అతడిని అడ్డుకున్నారు. కంపెనీ రద్దు చేసే వరకు తమ ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలిలా.. మండలంలోని కొంకలకు చెందిన తెలిగి గుడిసె శ్రీనివాసులు, ఇట్లపురం శ్రీను, టీజీ రామకృష్ణ శనివారం శాంతినగర్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గుడిసె శ్రీనివాసులు శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాసులుకు భార్యతోపాటు ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.